సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం । 13 । మే । 2023



జాబ్‌మేళాకు విశేష స్పందన

విశాఖలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. IIలో



కాంతార నృత్యాలకు ఫిదా

గ్రామదేవతల సంబరాల్లో కాంతార నృత్యాలు అలరిస్తున్నాయి. మన్యం వాసులను ఈ నృత్యాలు ఎంతో ఆకట్టుకుంటున్నాయి. IIలో



మృత్యుశకటం

దుస్తుల కర్మాగారం ఉద్యోగులను తీసుకెళ్లే వాహనాల మితిమీరిన వేగం మరో ఇద్దరి మృతికి కారణమయ్యింది. IIలో

న్యూస్‌రీల్

మోదమ్మ ఉత్సవాలకు ఆహ్వానం



కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఉత్సవ ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

సాక్షి, పాడేరు: ఈనెల 14, 15, 16 తేదీల్లో నిర్వహించనున్న మోదకొండమ్మ తల్లి జాతర మహోత్సవాలకు కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను ఆలయ కమిటీ చైర్‌పర్సన్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి శుక్రవారం ఆహ్వానించారు. ఈ మేరకు ఆహ్వాన పత్రికను అందజేశారు. జాయింట్ కలెక్టర్ జె.శివశ్రీనివాస్, అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, డీఆర్వో పి.అంబేద్కర్‌ను ఆహ్వానించారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలం నాయుడు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అరడకోటలో 'సుందరం మాస్టారు' సందడి

- జలపాతాల వద్ద కీలక సన్నివేశాల చిత్రీకరణ



అరడకోట గెడ్డ జలపాతంలో చిత్ర యూనిట్ సభ్యుల సందడి

పెదబయలు: మండలంలోని అరడకోట చాకలిగెడ్డ జలపాతం వద్ద సినిమా సుందరం మాస్టారు సినిమాకు సంబంధించి షూటింగ్ సందడి నెలకొంది. ఇదే ప్రాంతాల్లో పలు సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు.గోల్డెన్ మీడియా బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ సినిమాకు సంబంధించి గిన్నెలకోట పంచాయతీ పిట్టలబొర్ర జలపాతం, ఒడిశా బల్ల కేవ్స్ వద్ద కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. ప్రధానపాత్రలో నటిస్తున్న యువహర్ష మాట్లాడుతూ మన్యంలో అందాలు ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. జలపాతాలు అందాలు మంత్రముగ్ధుల్ని చేశాయని ఆయన పేర్కొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

రంపచోడవరం: ఏపీ గిరిజన గురుకుల విద్యాసంస్థల్లో 2023- 24 ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు రంపచోడవరం గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ప్రసన్న తెలిపారు. రంపచోడవరం, మారేడుమిల్లి, అడ్డతీగల, వై. రామవరం, రాజవొమ్మంగి, చింతూరు, కూనవరం కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, ఏటీ, సీజీఏ గ్రూపుల్లో ప్రవేశానికి విద్యార్థులు ఈనెల 12వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 31 వరకు గడువు ఉందన్నారు. దరఖాస్తు చేసిన విద్యార్థులకు సంబంధించి వచ్చేనెల జూన్ 8న మెరిట్ లిస్ట్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పారు.

టీచర్ల పదోన్నతులకు 16న కౌన్సెలింగ్

రంపచోడవరం: పూర్వ తూర్పు గోదావరి జిల్లా గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలను పదోన్నతిపై నిబంధనలకు అనుగుణంగా భర్తీ చేస్తున్నట్టు డిప్యూటీ డైరెక్టర్ జాన్‌రాజ్ తెలిపారు. ఈ నెల 16న కౌన్సెలింగ్ నిర్వహించేందుకు పీవో నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. పదోన్నతులు పొందేందుకు అర్హత ఉన్న ఉపాధ్యాయులు 16న ఉదయం 9 గంటలకు ఒరిజనల్ సర్టిఫికెట్లతో ఐటీడీఏ సమావేశ మందిరంలో జరిగే ప్రమోషన్ కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ఆయన సూచించారు.

పాలిటెక్నిక్ వార్షిక పరీక్షలు ప్రారంభం

మురళీనగర్(విశాఖ): పాలిటెక్నిక్ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు సి-20సిలబస్‌కు సంబంధించి వార్షిక పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో 99శాతం విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. పరీక్షలు ఈనెల 27వ తేదీ వరకు నిర్వహిస్తారు. ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు పర్యవేక్షించారు. సీ-20 సిలబస్‌కు సంబంధించి ఫస్టియర్ వార్షిక పరీక్షలతోపాటు సెకండియర్ థర్డ్ సెమిస్టర్ సప్లమెంటరీ, ఫోర్త్ సెమిస్టర్ రెగ్యులర్, సప్లమెంటరీ పరీక్షలకు విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం పరీక్ష 9.30గంటల నుంచి 12.30గంటలకు, మధ్యాహ్నం పరీక్ష 2.00గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించారు.

వినువీధి నుంచి కనువిందుగా..

మన్యంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందిన బొర్రాగుహల వద్ద సరికొత్త అందాలను పరిచయం చేసేలా.. పర్యాటకశాఖ మరో అడుగుముందుకు వేసింది. గుహల వద్ద లోతట్టు ప్రాంతంలో దాగి ఉన్న గోస్తని అందాలను అందుబాటులో తెచ్చేందుకు సంకల్పించింది. జిప్‌లైన్ ఏర్పాటు చేసి పర్యాటకులకు మరుపురాని అనుభూతిని కలిగించేలా పర్యాటకశాఖ చర్యలు చేపట్టింది.



జిప్ లైన్ ఏర్పాటు చేయనున్న బొర్రా గోస్తని నది ప్రాంతం (ఇన్‌సెట్‌లో విహారం)

- జిప్‌లైన్‌తో గోస్తనీపై అందాల విహారం
- పర్యాటకులకు మరో మధురానుభూతి
- కొద్దిరోజుల్లోనే అందుబాటులోకి..
- చురుగ్గా నిర్మాణ పనులు
- నెలాఖరులోగా పూర్తికి పర్యాటకశాఖ చర్యలు

అనంతగిరి: జిల్లాలో బొర్రాగుహల సందర్శనకు వచ్చే పర్యాటకులకు కొంత అందాలు వీక్షించి తనివితీరా అనుభూతి పొందనున్నారు. ఇప్పటికే బొర్రా గుహలకు విశ్వవ్యాప్తంగా ఖ్యాతి ఉంది. 150 మిలియన్ సంవత్సరాల క్రితం సహజసిద్ధమైన భౌగోళిక రసాయన చర్యల వల్ల ఇవి ఏర్పడ్డాయి. వీటి అందాలను తిలకించేందుకు దేశవిదేశాలతో పాటు తెలుగురాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలనుంచి భారీగా పర్యాటకులు, ప్రముఖులు తరలివస్తుంటారు. గుహల అందాలకు మంత్రముగ్ధులు అవుతుంటారు.

గోస్తని అందాలు తిలకించేలా..

బొర్రా గుహలను ఆనుకొని లోతట్టు ప్రాంతంలో గోస్తని నది ఉంది. లోయగా కనిపించే ఈ ప్రాంతంలో ప్రకృతి అందాలు తిలకించాలంటే తప్పనిసరిగా జిప్‌లైన్‌తో వెళ్లాల్సింది. త్వరలోనే ఈ సౌకర్యం అందుబాటులోకి రానుంది.సుమారు రూ.35 లక్షలతో జిప్‌లైన్ ఏర్పాటుకు ఫిల్లర్ల పనులు మొదలయ్యాయి. ఈ సౌకర్యం అందుబాటులోకి వస్తే పర్యాటకశాఖకు మరింత ఆదాయం పెరగడంతో పాటు సందర్శకులకు మరపురాని అనుభూతి పొందనున్నారు.

అటవీశాఖ అనుమతికోసం..

జిప్‌లైన్ ఏర్పాటుచేసే ప్రాంతమంతా రిజర్వు ఫారెస్టు పరిధిలో ఉంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ండువైపులా పోస్టులు నిర్మిస్తారు. ఒకటి బొర్రాగుహలు ప్రాంగణం కాగా మరోకటి గోస్తనీ నది అవతల పక్కన ఉన్న రిజర్వ్ ఫారెస్ట్‌లో ఏర్పాటుచేయాల్సి ఉంది. ఇందుకు అటవీశాఖ అనుమతులు తప్పినిసరి. ఇందు నిమిత్తం ఇప్పటికే పర్యాటకశాఖ అనుమతి కోరుతూ అటవీశాఖకు ప్రతిపాదనలు పంపింది. కొద్దిరోజుల్లోనే ఆమోదం వచ్చే అవకాశం ఉందని ఆశాఖ అధికారులు భావిస్తున్నారు.



బొర్రా గుహల వద్ద ప్రారంభమైన జిప్ లైన్ పిల్లర్ల పనులు

నెలాఖరులోగా పూర్తి

పర్యాటకులకు నూతన కొత్త అనుభూతిని పొందేలా జిప్‌లైన్ ప్రాజెక్టును అందుబాటులోకి తెస్తున్నాం. నెలఖారులోగా జిప్‌లైన్ ప్రాజెక్టు పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. దీనివల్ల పర్యాటకులు కొత్త అందాలు ఆస్వాదించే భాగ్యం అందుబాటులో వస్తుంది. అయితే ప్రాజెక్టుకు సంబంధించి అటవీశాఖ అనుమతులురావాల్సి ఉంది.

– ఫణి శ్రీనివాస్, రీజినల్ డైరెక్టర్, పర్యాటకశాఖ, విశాఖపట్నం

సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టండి

- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం
- 65 అర్జీలు స్వీకరణ



అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు: జిల్లా ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాసు, అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవలతో కలిసి 65 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీదారులు సమస్యలు పరిష్కరించలేదని రెండోసారి స్పందనకు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నేరుగా అర్జీదారుల వద్దకు వెళ్లి పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పి.అంబేద్కర్, గిరిజన సంక్షేమశాఖ డీడీ ఐ.కొండలరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.జమాల్‌బాషా, గిరిజన సంక్షేమశాఖ ఈఈ డి.వి.ఆర్.ఎం.రాజు, రహదారుల భవనాలశాఖ ఈఈ బాలసుందరబాబు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి.ఎస్.నంద్, జిల్లా ఉద్యానవన అధికారి రమేష్‌కుమార్ రావు, పీహెచ్‌వో ఎన్.అశోక్, ఐటీడీఏ పరిపాలనాధికారి పి.ఎస్.కుమార్ పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..

- ఎన్టీఆర్ హౌసింగ్ బిల్లు బకాయి రూ.50 వేల మంజూరు చేయాలని పి.కృష్ణ వినతి పత్రం అందజేశారు.
- పాడేరు తలారిసింగి హెలిప్యాడ్ వద్ద మినీ స్టేడియాన్ని అభివృద్ధి చేయాలని ఫిజికల్ డైరెక్టర్లు టి.సిద్ధు, పి.సూరిబాబు, జి.మన్మథరావు, తదితరులు వినతి పత్రం సమర్పించారు.
- ముంచంగిపుట్టు మండలం, కించాయిపుట్టు, గుమ్మసిరసాపుట్టు గ్రామాలకు తాగునీటి సదుపాయం కల్పించాలని గిరిజన సంఘం ఉపాధ్యక్షుడు ఎం.ఎం.శ్రీను కోరారు. ముంచంగిపుట్టు మండల కేంద్రంలో ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ముందున్న ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన వినతిపత్రంలో పేర్కొన్నారు.

75 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయి, నిందితులతో పోలీసులు

అనంతగిరి: ఒడిశా నుంచి మైదాన ప్రాంతానికి కారులో అక్రమంగా తరలిస్తున్న 75 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఐదుగురిని అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ కరక రాము తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఒడిశా నుంచి మైదాన ప్రాంతానికి వెళ్తున్న ఢిల్లీ రిజిస్ట్రేషన్ కారును ఆపి తనిఖీ చేయగా 75 కిలోల గంజాయి బయటపడిందని ఎస్ఐ తెలిపారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన గౌరవ్, షేక్ జమ్మున, సలీంఖాన్ కారుకు ముందుగా ద్విచక్రవాహనంపై పైలెట్‌గా వ్యవహరించారన్నారు. ఈ కేసులో ఒడిశాకు చెందిన బాబు ముదలై, సదాశివతో కలిపి ఐదుగురిని అరెస్టు చేశామన్నారు.గంజాయితో పాటు, కారు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని ఆయన పేర్కొన్నారు. నిందితులను ఐదుగురిని కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్టు ఆయన వివరించారు.

అంబరాన్నంటిన సంబరం

- ఘనంగా మోదమ్మ పుట్టినరోజు వేడుక
- భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం
- పురవీధుల్లో అమ్మవారి ఊరేగింపు
- ఆకట్టుకున్న బాణసంచా కాల్పులు



దర్శించుకుంటున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి దంపతులు. మాజీ మంత్రి మణికుమారి,కమిటీ ప్రతినిధులు

సాక్షి, పాడేరు: మన్యం ప్రజల ఆరాధ్యదైవం పాడేరు మోదకొండమ్మతల్లి ఊరేగింపు సంబరం అంబరాన్నంటింది. శుక్రవారం ఆలయ వార్షికోత్సవం, అమ్మవారి పుట్టినరోజు వేడుకను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.ఆలయ కమిటీ అధ్యక్షురాలు,ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు దంపతులు తొలిపూజ నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మాజీ మంత్రి మణికుమారి, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, రమాదేవి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వర్తన పిన్నయ్యదొర, ముత్యాలమ్మ దంపతులతో పాటు ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు దర్శనానికి బారులు తీరారు. భక్తులు మోదకొండమ్మ ఆలయ కమిటీ తరఫున ఎమ్మెల్యే భాగ్యలక్ష్మిదంపతులు ఉచిత ప్రసాదాలను పంపిణీ చేశారు.



దర్శకుడు పరశురామ్‌కు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

పల్లకిలో..

మోదమ్మతల్లి ఉత్సవ విగ్రహాన్ని సాయంత్రం పాడేరు పురవీధుల్లో పల్లకిలో ఊరేగింపు నిర్వహించారు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, డాక్టర్ నర్సింగరావు దంపతులు అమ్మవారి ఉత్సవ విగ్రహానికి సాయంత్రం పూజలు చేశారు. వారితోపాటు భక్తులు పల్లకి మోశారు. ఊరేగింపు అట్టహాసంగా నిర్వహించారు. శక్తి వేషాలు, తీన్‌మార్ డప్పులు వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బాణసంచా కాల్పులు ఆకట్టుకున్నాయి. వైస్ ఎంపీపీ గంగపూజారి శివకుమార్, సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, ఉప సర్పంచ్ బూరెడ్డి రాము, ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి తమర్బ ప్రసాద్‌నాయుడు, గౌరవ అధ్యక్షుడు కొట్టగుళ్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



ఊరేగింపులో శక్తివేషాలు

దర్శించుకున్న సినీ దర్శకుడు పరశురామ్

పాడేరు రూరల్ : పాడేరు మోదకొండమ్మ అమ్మవారిని ప్రముఖ సినీ దర్శకుడు పెట్ల పరశురామ్ శుక్రవారం దర్శించుకున్నారు ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ కమిటీ అమ్మవారి చిత్రపటాలు, ప్రసాదం అందజేసింది.



ఊరేగింపులో భక్తులు



అమ్మవారి దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

జూన్ నాటికి ఆటోమేటిక్ ఫిట్‌నెస్ సెంటర్

రవాణా శాఖ కమిషనర్ మనీష్ కుమార్



ఆటోమేటిక్ ఫిట్‌నెస్ సెంటర్‌ను పరిశీలిస్తున్న రవాణా కమిషనర్ మనీష్‌కుమార్

గోపాలపట్నం: ఆటోమేటిక్ ఫిట్‌నెస్ సెంటర్‌ను త్వరగతిన పూర్తి చేయాలని రవాణా శాఖ కమిషనర్ మనీష్ కుమార్ సిన్హా ఆదేశించారు. శుక్రవారం ఆయన గంభీరంలో నిర్మాణంలో ఉన్న ఫిట్‌నెస్ సెంటర్‌ను సందర్శించారు. అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. అలాగే ఆటోమేటిక్ డ్రైవింగ్ ట్రాక్‌ను పరిశీలించారు. ఈ పనులు జూన్ నెలాఖరులోగా పూర్తి చేయాలని కాంట్రార్టర్‌ను ఆదేశించారు. అనంతరం రవాణా శాఖ కార్యాలయాన్ని సందర్శించారు. ఆర్థిక లక్ష్యాలను సాధించాలని, ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలని ఆదేశించారు. ఆయనతో పాటు రీజినల్ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ డాక్టర్ వి. సుందర్, ఉప రవాణా కమిషనర్ సీజీ రాజారత్నం పాల్గొన్నారు.

ఆస్పత్రిలో ప్రసవానికి ససేమిరా..!



శిశువుకు వైద్యం అందిస్తున్న సిబ్బంది



కాలినడన వెళుతున్న వైద్య సిబ్బంది

- నిరాకరించిన గర్భిణి
- వైద్యసిబ్బంది నచ్చజెప్పినా వినని వైనం

జి.మాడుగుల: ప్రసవానికి ఆస్పత్రికి రావాలని గర్భిణులను ఎంత ప్రాధేయపడినా ససేమిరా అనడంతో వైద్యసిబ్బంది వెనుదిరిగారు. మండలంలో గెమ్మెలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గడుతూరు పంచాయతీ మారుమూల బొడ్డుమామిడి గ్రామాన్ని శుక్రవారం వైద్య సిబ్బంది సందర్శించారు. ఈ గ్రామానికి రోడ్డు సదుపాయం లేకపోవడంతో వారు రానుపోను సుమారు 20 కిలోమీటర్లు కాలినడకన వెళ్లారు. సుమారు 135 మంది జనాభా ఉన్న ఈ గ్రామంలో ఆరుగురు గర్భిణులు ఉన్నారు. వీరిలో ప్రసవానికి సిద్ధంగా ఉన్న వంతాల లక్ష్మిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేరాలని వైద్యసిబ్బంది ప్రాధేయపడ్డారు. ఆమె భర్త చిట్టిబాబుకు నచ్చజెప్పారు. తాము ఆస్పత్రికి రాలేమని, వస్తే చనిపోతామని, ప్రభుత్వ మందులు వద్దని వారు చెప్పడంతో వైద్యసిబ్బంది అవాక్కయ్యారు. దీంతో చేసేదిలేక గ్రామంలో చిన్నపిల్లలకు వైద్యసేవలందించి వెనుదిరిగారు. ఎంపీహెచ్‌ఏ రాజు, ఎంఎల్‌హెచ్‌పీ వైపీ నాయుడు, గ్రామవలంటీర్ లక్ష్మణ్, గ్రామపెద్ద జి.బద్రీ తదితరులు పాల్గొన్నారు.

గెడ్డలోకి దూసుకెళ్లిన కారు

- అదుపుతప్పి ప్రమాదం
- డ్రైవర్ సురక్షితం

పెదబయలు: మండలంలోని అడుగులపుట్టు పంచాయతీ కొత్తాపుట్టు గ్రామ సమీపంలోని రెయ్యలగెడ్డ వంతెన కింద కారు అదుపుతప్పి గెడ్డలోకి దూసుకెళ్లింది. పాడేరు నుంచి ముంచంగిపుట్టు మీదుగా ఒడిశాలోని ఒనకడిల్లీ వెళ్తుండగా గురువారం రాత్రి ప్రమాదానికి గురైంది. అదుపుతప్పి 30 అడుగుల ఎత్తులోని వంతెనపై నుంచి దూసుకెళ్లి గెడ్డలో పడిపోయింది. ఆసమయంలో ఒడిశాకు చెందిన డ్రైవర్ సురేష్ మాత్రమే ఉన్నారు. కారు నీటిలో పడిన వెంటనే డైవర్ బయటకు రావడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే కొత్తపుట్టు గ్రామానికి చెందిన స్థానికులు గమనించారు. వెంటనే సహాయకచర్యలు చేపట్టారు. ఈ ఘటనపై ఎస్ఐ మనోజ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రెయ్యల గెడ్డలో కారు

దైవ బలం.. దాతల సహకారం

స్వామి భక్తికి చెరగని చిరునామా ఆంజనేయుడు. రామభద్రుడిని మదిలోనే నిలుపుకొన్న అంజనీపుత్రుడు అనన్య భక్తిలో తనకు తానే సాటి. స్వచ్ఛతకు ప్రతిరూపమైన గిరిజనుల్లో భక్తిభావాన్ని పెంపొందించాలనే సత్సంకల్పంతో విగ్రహస్థాపనను మహాయజ్ఞంగా భావించి చేస్తున్నారు సద్గురు సేవాశ్రమం నిర్వాహకుడు కోన అప్పలరాజు. ఆయన సంకల్పానికి దాతల సహకారం తోడై వేయి విగ్రహాల స్థాపన యజ్ఞంలో భాగంగా ఇప్పటికే 610 విగ్రహాలను ప్రతిష్టించారు.

- నిర్విఘ్నంగా ఆంజనేయ విగ్రహ యజ్ఞం
- సహస్ర విగ్రహాల స్థాపనే లక్ష్యం
- భక్తిభావం పెంపొందిస్తున్న సద్గురు సేవాశ్రమం



రాళ్లగడ్డలో ప్రతిష్టించిన ఆంజనేయ విగ్రహం

తగరపువలస: ప్రజల్లో భక్తిభావం పెంపొందించేందుకు విశాఖలోని జీవీఎంసీ 3వ వార్డు రామయోగి అగ్రహారంలోని సద్గురు సేవాశ్రమం నిర్వాహకుడు కోన అప్పలరాజు అలియాస్ యోగారాజు తనవంతు కృషి చేస్తున్నారు. దీనిలో భాగంగా ఇప్పటివరకు ఉమ్మడి విశాఖ జిల్లా, ఒడిశాలో 610 ఆంజనేయ స్వామి విగ్రహాలు ప్రతిష్టించారు. వీటిలో 570కు పైగా విగ్రహాలు మన్యంలోని అరకు, అనంతగిరి, చింతపల్లి, డుంబ్రిగుడ, గూడెం కొత్తవీధి, జి.మాడుగుల, హుకుంపేట, కొయ్యూరు, ముంచంగిపుట్టు, పాడేరు, పెదబయలు మండలాలతో పాటు ఒడిశాలోని కోరాపుట్, మల్కన్‌గిరి జిల్లాల్లో పూజలందుకుంటున్నాయి.

సహస్ర విగ్రహస్థాపనే లక్ష్యంగా..

సహస్ర విగ్రహ స్థాపనే లక్ష్యంగా దాతల అండదండలతో ఈ మహాయజ్ఞం ముందుకు సాగుతోంది.ఈ నెల 13న పాడేరు మండలం మినుములూరులో 610వ విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు చేశారు. గిరిజనుల్లో భక్తిభావం సడలిపోకుండా ఆంజనేయ స్వామి విగ్రహాలు ప్రతిష్టిస్తున్నట్లు అప్పలరాజు తెలిపారు. ఆశ్రమం తరపున ప్రతిష్టించిన విగ్రహాల్లో 5 నుంచి 12 అడుగుల సిమెంట్ విగ్రహాలతో పాటు ఇళ్లలో పూజించుకోవడానికి, జనాభా తక్కువ గల గ్రామాలకు 12 అంగుళాల కంటే తక్కువ సైజు రాతి విగ్రహాలు అందిస్తున్నారు.

ఏడాది పొడవునా పూజాసామగ్రి పంపిణీ

మన్యంలో ప్రతిష్టించిన విగ్రహాలు ఉన్న చోట 500కు పైగా ఆలయాలకు నెలకు రూ.2.25లక్షల వంతున ఏడాది పాటు రూ.27 లక్షల విలువైన పూజా సామగ్రి పంపిణీ చేశారు. విగ్రహ ప్రతిష్ఠ రోజు గిరిజనులకు దుస్తులు, స్టీల్ కంచాలు, దేవుళ్ల ఫొటోలను పంపిణీ చేస్తున్నారు. విగ్రహాల ఏర్పాటుకు ఇప్పటి వరకు ఆశ్రమం తరపున రూ.2కోట్ల వరకు ఖర్చు చేశారు.

మన్యం ప్రజల కోరిక మేరకు.

మన్యంలో ఆలయాలు తక్కువగా ఉంటాయి. ముఖ్యంగా మారుమూల గ్రామాల ప్రజలు రాళ్లను పూజిస్తుంటారు. రాళ్లగడ్డలో మొదటి విగ్రహం ప్రతిష్టించిన రోజు.. తమ గ్రామాల్లో కూడా విగ్రహాలు ప్రతిష్టించాలని గిరిజనులు కోరడంతో ఆ సంఖ్య 610కు చేరింది. విగ్రహాలు కావలసిన గిరిజన గ్రామాల ప్రజలు నాలుగు అడుగుల ఎత్తులో 6x6 సైజులో దిమ్మె నిర్మించుకుంటే.. వారికి చోడవరం, వడ్డాది, రాజమండ్రి తదితర ప్రాంతాల్లో తయారు చేయించిన విగ్రహాలు తరలించి ప్రతిష్ఠ చేయిస్తున్నారు. విగ్రహ ప్రతిష్ఠ సమయంలో స్థానికులే అన్నదానాలు ఏర్పాటు చేసుకుంటున్నారు.

ఆలయాల నిర్మాణానికీ చేయూత

ఏడాది కిందట అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో రూ.50 లక్షలు ఖర్చు చేసి 15 అడుగుల పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహంతో పాటు ఆలయం నిర్మించారు. ఇదే కాకుండా హుకుంపేట మండలం మద్దివీధి శివాలయం పునరుద్ధరణ, ములుసోబలో వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. విజయసాయి యోగా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా యోగాలో ఉచిత శిక్షణ, నేత్ర వైద్యశిబిరాలు, తాగునీటి కొరత ఉన్నచోట బోర్ల తవ్వకాలు, వంట పాత్రలు పంపిణీ చేస్తున్నారు. గత ఏడాది చింతపల్లి ప్రాంతంలోమోటార్లు, పైపులైన్, టాంకర్ల ద్వారా అక్కడి ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించారు.

వెయ్యి విగ్రహాలను ప్రతిష్టిస్తాం



ఆంజనేయ స్వామి విగ్రహాల ఏర్పాటుకు మన్యంలోని వివిధ గ్రామాల నుంచి రోజురోజుకు ప్రతిపాదనలు వస్తున్నాయి. ఒక్క విగ్రహం మాత్రమే అనుకుని ప్రారంభమైన ఈ దీక్ష హనుమాన్ శక్తి తోడుతో.. 610 విగ్రహాలకు చేరింది. దైవబలం, దాతల సహకారం లభిస్తుండటంతో వెయ్యి విగ్రహాల మైలురాయిని చేరుకుంటాం. విగ్రహాలు అవసరమైన మన్యం గ్రామాల ప్రజలు 98486 49067, 85005 09067 నంబర్లకు సంప్రదించవచ్చు.

– యోగా రాజు, రామయోగి అగ్రహారం, భీమిలి

క్లుప్తంగా

సీ హారియర్ సందర్శనకు సిద్ధం

దొండపర్తి (విశాఖ దక్షిణ): సీ హారియర్ మ్యూజియం సందర్శనకు సిద్ధమైంది. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఈ మ్యూజియం ప్రారంభమైన విషయం తెలిసిందే. దీంతో పర్యాటకుల సందర్శనకు వీఎంఆర్‌డీఏ ఈ మ్యూజియాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. సోమవారం నుంచి శనివారం వరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు, అలాగే ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, అదే విధంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8.30 వరకు సందర్శకులను అనుమతించనున్నారు. పిల్లలకు రూ.40, పెద్దలకు రూ.70, వీడియో కెమెరాతో వెళ్లే వారికి రూ.200గా టికెట్ ధరను నిర్ణయించారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీయర్ సర్వీస్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించినట్టు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సీహెచ్ సుబ్బిరెడ్డి (క్లరికల్), కొత్తలంక సుధ (టెక్నికల్) తెలిపారు. ఫ్లిప్‌కార్ట్ (హైదరాబాద్), వింధ్యా-ఇన్ఫో మీడియా (బెంగళూరు), హిరావత్స్ (విశాఖ), అస్ లిమిటెడ్ షాపింగ్ మాల్, పెగాసిస్టమ్స్ సాఫ్ట్‌వేర్ కంపెనీ (హైదరాబాద్, వినిస్, కేఎఫ్‌సీ, పాల్ ప్లాస్టిక్ మ్యానుఫ్యాక్చరింగ్, బిగ్ బాస్కెట్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, బిగ్ సి మొబైల్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో దివ్యాంగులకు, సాధారణ అభ్యర్థుల కోసం 312 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూల్లో 175 మంది పాల్గొన్నారు. దివ్యాంగులు, సాధారణ అభ్యర్థులు 95 మంది ఎంపికైనట్టు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జె.మాధవి ఆయా కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వాతావరణం

అనకాపల్లి టౌన్: రాగల ఐదు రోజులు 29 నుంచి 29.4 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి శుక్రవారం పేర్కొన్నారు. గాలిలో తేమ 70 నుంచి 73 శాతం, గాలి గంటకు 4 నుంచి 5 కిలోమీటర్ల వేగంతో వీస్తుందన్నారు.

తొలి వెలుగుకు జేజేలు

- మొదటి విద్యుత్ బల్బు వెలిగింది పాతనగరంలోనే..
- జనరేటర్ సాయంతో కరెంట్ సరఫరా మొదలు పెట్టిన సెయింట్ అలోసియస్
- 1908 మే 13న విశాఖలో కరెంట్‌తో యంత్రాల పనితీరు ప్రారంభం

సాక్షి, విశాఖపట్నం : చీకటి బస్తీగా ఉన్న విశాఖకు.. విద్యుత్ వెలుగులు ఎప్పుడొచ్చాయి.? ఈ ప్రశ్న అందరి మదిలో మెదులుతోంది కదా.? నిజమే.. నగరంలో కరెంట్ బల్బు ఎప్పుడు వెలిగిందో తెలుసా..? ఈ రోజుకు సరిగ్గా 115 ఏళ్లు గడిచాయి. అయితే.. ఇందులో ఉన్న ట్విస్ట్ ఏంటంటే.. తొలి విద్యుత్ బల్బు వెలిగింది కరెంట్ కనెక్షన్‌తో కాదు. జనరేటర్ ద్వారా.. అది కూడా.. ఈ మహానగరంలో పాతబస్తీగా చెప్పుకునే వన్‌టౌన్ ఏరియాలో. విశాఖలో విద్యుత్ బల్బు వెలిగిన నేపథ్యం గురించి.. మరిన్ని వివరాలు తెలుసుకోవాలని ఉందా.. అయితే ఈ స్టోరీ చదివేయండి..

ప్రస్తుతం ఉన్న వన్‌టౌన్ ఏరియాను అప్పట్లో పాతనగరంగా పిలిచేవారు. అక్కడ సెయింట్ అలోసియస్ టెక్నికల్ స్కూల్ అని ఉండేది. ఈ ఇండస్ట్రియల్ స్కూల్‌లో.. పాత తరం నాటి కార్లు, యంత్రాలు బాగుచేసేవారు. అయితే పని వేగాన్ని పెంచుకునేందుకు, రాత్రి సమయంలో కూడా ఈ యాజమాన్యం జనరేటర్లను తీసుకొచ్చింది. అప్పటికింకా నగరంలో విద్యుత్ వినియోగం ప్రారంభం కాలేదు. ఆ సమయంలో ఇతర దేశాల నుంచి జనరేటర్ తీసుకొచ్చి సెయింట్ అలోసియస్ స్కూల్ కొత్త బిల్డింగ్‌లో 1908 మే 13న విద్యుత్ బల్బులను వెలిగించారు. ఈ విద్యుత్ వెలుగులను చూసేందుకు విశాఖ ప్రజలు ప్రత్యేకంగా వెళ్లేవారని మద్రాస్ మెయిల్‌లో 1908లోనే పొందుపరిచారు. సెయింట్ అలోసియస్ స్కూల్ 175 ఏళ్ల వేడుకలు ఇటీవల జరిగిన నేపథ్యంలో ఆ పాఠశాల పూర్వ విద్యార్థి జాన్ కాస్టెల్లాస్ ఈ విషయాన్ని వెలుగులోకి తీసుకొచ్చారు.

కేజీహెచ్‌లో పవర్ హౌస్‌లు..

ఆ తర్వాత వాల్తేరు క్లబ్‌కు రెండు డీజిల్ జనరేటర్లను తీసుకొచ్చి క్లబ్‌లో 1912 నుంచి విద్యుత్ సరఫరా ప్రారంభించారు. 1915లో సెయింట్ పాల్స్ చర్చికి ఎలక్ట్రిక్ ఇన్‌స్టాలేషన్ వచ్చింది. పాత కొవ్వొత్తుల స్థానంలో ఎలక్ట్రికల్ బల్బులు, ఫ్యాన్లు అమర్చారు. ఈ విద్యుత్ సరఫరాకు అయిన ఖర్చు మొత్తం చర్చి సభ్యులు చందాలు వేసుకుంటూ భరించారు. ఇక 1923లో కేజీహెచ్ హాస్పిటల్‌లో విద్యుత్ సరఫరా మొదలైంది. ఇందుకోసం పవర్ హౌస్‌ను ఏర్పాటు చేశారు. రెండేళ్ల తర్వాత మరో పవర్ హౌస్ ఏర్పాటు చేశారు.



పోర్టులో అప్పట్లో ఏర్పాటు చేసిన పవర్ హౌస్

ప్రజల కోసం పోర్టులో థర్మల్ ప్రాజెక్టు

అప్పటి వరకూ వివిధ సంస్థలకు మాత్రమే విద్యుత్ సరఫరా వచ్చిన నేపథ్యంలో ప్రజల కోసం కరెంట్‌ను అందించేందుకు విశాఖపట్నం పోర్టులో చర్యలు చేపట్టారు. తొలుత పోర్టు నిర్మాణ సమయంలో సొంత వినియోగానికి థర్మల్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు చేసుకోగా క్రమంగా రెండు జనరేటర్ల సాయంతో 300 కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో పవర్ ప్రాజెక్టును నడిపించారు. మునిసిపల్ లైటింగ్ అథారిటీకి, బెంగాల్, నాగ్‌పూర్ రైల్వేకి పెద్ద మొత్తంలో విద్యుత్‌ను విశాఖ పోర్టు నుంచే సరఫరా చేయాలని ప్రతిపాదించారు. ఓడరేవు నిర్మాణం పూర్తయ్యే సమయానికి ఈ పవర్‌హౌస్ నుంచి విద్యుత్‌ని మున్సిపల్ అధికారులకు అందించాలనే ప్రతిపాదన కూడా తీసుకొచ్చారు. ఆ సమయంలో పోర్టు, రైల్వే, ప్రభుత్వ నిర్మాణ పనులు చేపడుతున్న అప్పటి ఇంజినీర్ దంతులూరి లక్ష్మీ నరసింహరాజు ఆంధ్రా ఇంజినీరింగ్ అండ్ కోసం పేరుతో ప్రభుత్వం నుంచి 1910 విద్యుత్ చట్ట ప్రకారం 1933లో పవర్ హౌస్ కోసం లైసెన్స్ తీసుకొచ్చారు. పోర్టు నుంచి విశాఖ నగరానికి విద్యుత్ సరఫరాకు లైన్ క్లియర్ అయ్యింది.



తొలి విద్యుత్ బల్బు వెలిగింది ఇక్కడే...

1938 నుంచి పూర్తి సరఫరా మొదలు..

విజగపట్నం ఎలక్ట్రిక్ సప్లై కార్పొరేషన్ (వెస్కో) పేరుతో పబ్లిక్ లిమిటెడ్ కంపెనీ ప్రారంభించారు. ఇది ప్రస్తుతం ఉన్న డిస్కమ్‌లతో సమానమని చరిత్ర చెబుతోంది. ఆంధ్రా జిల్లాల విద్యుత్ అవసరాలపై అధ్యయనం చేసిన మద్రాసు ప్రభుత్వం విశాఖపట్నం నగర అవసరాల్ని తీర్చేందుకు లంబసింగిలో హైడ్రో ఎలక్ట్రిక్ స్కీమ్ కోసం 1935-36 కాలంలో అధ్యయనం చేసి రూ.18.70 లక్షలు మంజూరు చేసింది. పోర్ట్ పవర్ హౌస్‌ను మద్రాసు ప్రభుత్వం కొనుగోలు చేసి.. మరో థర్మల్ ప్లాంట్ నిర్మాణాన్ని పోర్టు ఏరియాలోనే ప్రారంభించింది. 1938 మార్చి 26 ఈ ప్లాంట్ అమల్లోకి రాగా.. రెండు పవర్ స్టేషన్లతో విశాఖపట్నం నగరానికి 1938లో విద్యుత్ సరఫరా మొదలైంది. ప్రస్తుతం ఈ విద్యుత్ సరఫరాని విశాఖకు ఏపీఈపీడీసీఎల్ నుంచి అందుతోంది.

బాంబు దాడిలో పవర్ హౌస్ ధ్వంసం

విజ్జేశ్వరపు ఎడ్వర్డ్ పాల్, చరిత్రకారుడు



రెండో ప్రపంచ యుద్ధ సమయంలో విశాఖపట్నం పోర్టుపై 1942 ఏప్రిల్ 6న జపాన్ విమానాలు బాంబుదాడులు చేశాయి. ఈ దాడుల్లో పోర్టు పవర్ హౌస్ ధ్వంసం కావడంతో ఆ రాత్రి నగరంలో చిమ్మచీకట్లు కమ్ముకున్నాయి. 1952లో వెస్కో బాధ్యతను మద్రాసు ప్రభుత్వం తీసుకుంది. వెస్కో ఆస్తులన్నింటినీ విద్యుత్ అండర్‌టేకింగ్ అక్విజిషన్ యాక్ట్ ప్రకారం స్వాధీనం చేసుకోవడంతో.. విశాఖకు వెస్కో అందించిన కరెంట్ కార్యకలాపాలకు తెరపడింది. 1966లో థర్మల్ పవర్ స్టేషన్లను మూసివేయాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో పోర్టులో ఏర్పాటు చేసిన పవర్ స్టేషన్ పాత్ర కూడా ముగిసింది. నానాటికి నగరంలో పెరుగుతున్న డిమాండ్లకు అనుగుణంగా.. ఏపీఈపీడీసీఎల్ సరికొత్త వ్యవస్థతో విశాఖకు నిరంతరాయంగా విద్యుత్‌ని సరఫరా చేస్తోంది.

16 నుంచి సంస్కృత సంభాషణ శిబిరం

దాబాగార్డెన్స్: సంస్కృత భారతి ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి 25వరకు విశాఖ నగరంలోని విశాఖ సేవా సదన్ స్కూల్లో సంస్కృత సంభాషణ శిబిరం నిర్వహించనున్నట్టు సంస్కృత భారతి జిల్లా కార్యదర్శి డాక్టర్ మల్లాది శ్రీనివాస్ తెలిపారు. దేశ వ్యాప్తంగా సంస్కృతాన్ని ప్రాచుర్యం చేసేందుకు ఈ శిక్షణ నిర్వహించనున్నట్టు చెప్పారు. ప్రతి రోజూ ఉదయం 9 నుంచి 11 గంటల వరకు దశదిన శిబిరం రామ్‌నగర్‌లో గల విశాఖ సేవా సదన్ స్కూల్లో నిర్వహించనున్నట్టు చెప్పారు.

కాంతార నృత్యాలకు ఫిదా

గ్రామదేవతల సంబరాల్లో ప్రత్యేక ఆకర్షణ

రాజవొమ్మంగి: గ్రామదేవతల సంబరాల్లో ప్రదర్శిస్తున్న కాంతార నృత్యాలు అందరిని అలరిస్తున్నాయి. మన్యం వాసులను ఈ నృత్యాలు ఎంతో ఆకట్టుకుంటున్నాయి. ఇటీవల రాజవొమ్మంగి మండలం వట్టిగెడ్డలో పట్టాలమ్మ జాతర వైభవంగా జరిగింది. తాడేపల్లిగూడెంకు చెందిన కళాకారులతో ఈ సంబరాల్లో కాంతార నృత్యాలు ప్రదర్శించారు. కళాకారులు గజ్జె కట్టి నృత్యాలు చేస్తుంటే గ్రామస్తులు కన్నార్పకుండా వీక్షించారు. ఇటీవల విడుదలైన కాంతార అనే సినిమాలోని భూతకోలా ప్రక్రియను తలపించేలా కళాకారులు చేసిన నృత్యాలకు మన్యవాసులు ఫిదా అయ్యారు. గతంలో శక్తి వేషాలు వేసి జీవనం సాగించే కళాకారులు ఇప్పుడు విశేష ఆధరణ గల కాంతార నృత్యాలు చేస్తూ సంబరాలను రక్తి కట్టిస్తున్నారు. గ్రామదేవతల సంబరాల్లో ఇప్పుడివి ప్రత్యేక ఆకర్షణగా ఉంటున్నాయి. శక్తి, శివుడు, పార్వతి, నృసింహస్వామి వేషాలతో పాటు ఇప్పుడు కాంతార నృత్యాలు కూడా ప్రదర్శిస్తున్నామని తాడేపల్లిగూడెంకు చెందిన కళాకారుడు ఎడవల్లి శివ తెలిపారు. చేతిలో కాగడాలతో చేసే ఈ నృత్యప్రదర్శకు ఎంతో నేర్పు కావాలన్నారు. కాంతార సినిమా వచ్చిన తరువాత ఈనృత్యాలు చూసేందుకు ప్రేక్షకులు ఆసక్తి చూపుతున్నారని శివ తెలిపారు. ఈ వేషం వేయాలంటే కనీసం రూ.వెయ్యి ఖర్చవుతుందని, దాదాపు రెండు గంటలపాటు సమయం పడుతుందని ఆయన తెలిపారు.



మన్యవాసులను ఆకట్టుకొంటున్న కాంతార నృత్యప్రదర్శనలు

ప్రశంసలు కురిపించారు



ఇటీవల అనకాపల్లి వద్ద రామచంద్రపురంలో కాంతార నృత్యాలు ప్రదర్శించాం. ప్రజలు ఎంతో ఆసక్తిగా తిలకించి ప్రశంసలు కురిపించారు. శనివారం విశాఖపట్నంలోని హనుమంతువాకలో ఈ నృత్యం ప్రదర్శించనున్నాం. ఒక ప్రోగ్రాంకు మాకు రూ.30వేలు చెల్లిస్తారు. రవాణాఖర్చులు రూ.8 వేలు అవుతాయి. మేము మొత్తం 15మంది కళాకారులం. మా కుటుంబాలు ఈ కళపైనే ఆధారపడిఉన్నాం. ఆదరణ ఉన్నంత వరకు శక్తి వేషాలతో పాటు కాంతార నృత్యాలు ప్రదర్శిస్తాం. మాకు ఏడాదిలో ఏప్రిల్, మే, జులైలో మాత్రమే పని దొరుకుతుంది.

– ఎడవల్లి శివ, దుర్గాభవాని కాళిక డ్యాన్స్‌పార్టీ, తాడేపల్లిగూడెం

రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ దుర్మరణం

గొలుగొండ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహణ

తగరపువలస: ఆనందపురం మండలం దుక్కవానిపాలెం టోల్‌గేట్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అనకాపల్లి జిల్లా గొలుగొండ పోలీస్‌స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ గవిరెడ్డి దేవుడుబాబు(47) మృతి చెందారు.



మృతుడు దేవుడు బాబు(ఫైల్)

ఈ ఘటనపై సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్న దేవుడుబాబు తమ్ముడు అప్పలనాయుడు ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. జిల్లా కోర్టులో వారెంట్లు, సమన్లు తదితర విధులు నిర్వర్తించే దేవుడుబాబు శుక్రవారం ఉదయం కె.కోటపాడు మండలం చంద్రయ్యపేటలో తన ఇంటి నుంచి కోర్టుకు బయలు దేరారు.

అదే సమయంలో తనకు వరసకు సోదరుడైన సింగంపల్లి అప్పలనాయుడు కూడా కారులో విశాఖ వస్తున్నందున.. అతనితో పాటు పెందుర్తి మీదుగా ఆనందపురం వైపు వస్తున్నారు. దుక్కవానిపాలెం టోల్‌గేట్ వద్ద వాటర్‌బాటిల్ కొనుగోలుకు అతను కారు నుంచి కిందకు దిగారు.

తిరిగి కారు ఎక్కే సమయంలో వెనుక నుంచి మినీ లగేజీ వాహనం కారుతో పాటు దేవుడుబాబును బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కింద పడిన హెడ్ కానిస్టేబుల్ తలకు బలమైన గాయమై కుడిచేయి విరిగిపోయింది. వెంటనే సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రికి అతన్ని తరలించగా.. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మృత్యుశకటం

- బైక్‌ను ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు
- ఇద్దరు యువకుల దుర్మరణం



కిలాడి శ్రీను (ఫైల్)



కారుకొండ శ్రీను (ఫైల్)

అచ్యుతాపురం (అనకాపల్లి): దుస్తుల కర్మాగారం ఉద్యోగులను తీసుకెళ్లే వాహనాల మితిమీరిన వేగం మరో ఇద్దరి మృతికి కారణమయ్యింది. ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలు.. వెదురువాడ వద్ద శుక్రవారం మధ్యాహ్నం వేగంగా వెళుతున్న గౌతమ్ ట్రావెల్ బస్సు.. అప్పుడే మలుపు తిరుగుతున్న కిలాడి శ్రీను (24), కారుకొండ శ్రీను (23)లు వెళుతున్న బైక్‌ను ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన ఇద్దరూ చికిత్స పొందుతూ ఒకరు ఎన్టీఆర్ ఆస్పత్రిలో, మరొకరు అనకాపల్లి ప్రైవేట్ ఆస్పత్రిలో మృతి చెందారు.

రోడ్డున పడ్డ కుటుంబాలు

అచ్యుతాపురానికి చెందిన కిలాడి శ్రీనుకి భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. ఈ దుర్ఘటనతో వారు దిక్కులేని వారయ్యారు. శ్రీను తండ్రి కుమారుడి మృతితో కన్నీరుమున్నీరవుతున్నారు. నాలుగేళ్ల క్రితం పెద్ద కొడుకు పచ్చకామెర్లతో చనిపోయాడు. చిన్న కొడుకు శ్రీను చేదోడువాదోడుగా ఉండేవాడు. కొడుకు, కోడలు, మనవలతో హాయిగా కాలం గడుపుతున్న వృద్ధుడు ఉన్న ఒక్కగానొక్క కొడుకు మృతి చెందటంతో విలపిస్తున్న తీరు చుట్టుపక్కల వారిని కలచివేసింది. ఇదే ప్రమాదంలో మృతి చెందిన కారుకొండ శ్రీను జేసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. పెళ్లయి ఎంతో కాలం కాలేదు. ముందు రోజే వారి వివాహ వార్షికోత్సవం జరిగింది. ఇటీవల కాలంలో బ్రాండిక్స్‌కు చెందిన వాహనాలు రోడ్డు ప్రమాదాలకు గురవుతుండటంపై పలు ఫిర్యాదులు ఉన్నాయి.

స్థానికుల ఆందోళన

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మరణించడంతో వెదురువాడ వద్ద స్థానికులు బస్సును నిలిపివేసి ఆందోళన చేశారు. ఈ ఆందోళనతో రహదారి పొడవునా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు రంగంలోకి దిగి సముదాయించడంతో ఆందోళనకారులు శాంతించారు.

ఫార్మా కంపెనీలో ప్రమాదం

ముగ్గురు కార్మికులకు తీవ్ర గాయాలు


రాంబిల్లి: స్పెన్సులెస్ ఫార్మాటిక్ పరిశ్రమలో శుక్రవారం రోప్ తెగిపడ్డ ప్రమాదంలో ముగ్గురు కార్మికులకు తీవ్ర గాయాయ్యాయి. పలాస ప్రాంతానికి చెందిన కె.శివ, రాంబిల్లి మండలం కొత్తపట్నంకు చెందిన సీహెచ్ గంగరాజు, యలమంచిలి మండలం పులపర్తికి చెందిన ఎస్.నారాయణరావులు ఈ ప్రమాదంలో గాయపడ్డారు. వీరిని గాజువాకలోని ఆర్‌కే ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. స్థానిక ఎస్‌ఐను వివరాల కోసం సంప్రదించగా ప్రమాదం జరగడం వాస్తవమేనని, దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదు లేక కేసు నమోదు చేయలేదని ఎస్‌ఐ దీనబంధు తెలిపారు. రోప్ తెగిపోయిన ప్రమాదంలో గాయపడిన కార్మికులను యాజమాన్యం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను ఆయన పరామర్శించారు. సరైన భద్రతా ప్రమాణాలు పాటించక పోవడం వల్లే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆరోపించారు.



గాయపడిన కార్మికులను ఆర్‌కే ఆస్పత్రిలో పరామర్శిస్తున్న సీఐటీయూ నేత రాము

బైక్‌ను లారీ ఢీకొని వ్యక్తి మృతి

నాతవరం : మండలంలో శుక్రవారం లారీ, బైక్ ఢీకొన్న సంఘటనలో ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. దీనికి సంబంధించి నాతవరం ఎస్‌ఐ డి.లక్ష్మీనారాయణ అందించిన వివరాలు. మాధవనగరం గ్రామానికి చెందిన దమ్ము నూకరాజు(35) తన ఇంటి నుంచి జీడి తోటకు బైక్‌పై వెళ్తున్నాడు. అదే రోడ్డులో కర్రల లోడ్‌తో వస్తున్న లారీ నూకరాజు బైక్‌ను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో నూకరాజు తలకు గాయడం కావడంతో తీవ్ర రక్తస్రావమై, సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. ఇంటి నుంచి వెళ్లిన పది నిమిషాల వ్యవధిలోనే రోడ్డు ప్రమాదంలో చనిపోయినట్లుగా సమాచారం రావడంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు కన్నీరుమున్నీరయ్యారు. మృతుడు నూకరాజు కల్లుగీత కార్మికుడు. సీజన్‌లో కల్లు విక్రయిస్తుంటాడు. మిగిలిన సమయంలో వ్యవసాయ పనులకు వెళ్తాడు. నూకరాజు భార్య గ్రామ వలంటీరుగా పని చేస్తున్నారు. వారికి ఇద్దరు పిల్లలు. పెద్దమ్మాయి దివ్యాంగురాలు కావడంతో ఇంటి వద్దే ఉంటుంది. నాతవరం ఎస్‌ఐ డి.లక్ష్మీనారాయణ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు. పోస్టుమార్టమ్ నిమిత్తం మృత దేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.



మృతి చెందిన నూకరాజు, నుజ్జయిన బైక్‌ను పరిశీలిస్తున్న ఎస్‌ఐ లక్ష్మీనారాయణ

ఏలేరు కాలువలో పడి వృద్ధుడు గల్లంతు

కశింకోట : ఉగ్గినపాలెంవద్ద ఏలేరు కాలువలో ప్రమాదవశాత్తూ పడి వృద్ధుడు గల్లంతయ్యాడు. ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి శుక్రవారం రాత్రి అందించిన వివరాలు. తాళ్లపాలెంకు చెందిన తనకాల అప్పారావు (63)ఉగ్గినపాలెంలో ఓవివాహకార్యక్రమానికి వెళ్లాడు. అక్కడి ఏలేరు కాలువ వద్దకుబహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలువలో జారిపడిపోయి గల్లంతయ్యారు. కాలువ లో వెదికినా ఆచూకీ లభ్యంకాలేదు. కుమారుడు నాగేశ్వరరావు ఫిర్యాదుపై మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.


400 లీటర్ల సారా స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న సారా ప్యాకెట్ల మూటలు

పాడేరు రూరల్ : కామయ్యపేట జంక్షన్ వద్ద 400 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు పాడేరు ఎస్‌ఈబీ సీఐ సంతోష్‌కుమార్ శుక్రవారం తెలిపారు. హుకుంపేట మండలం కామయ్యపేట ప్రాంతం నుంచి పాడేరు ప్రాంతానికి సారా తరలిస్తున్నారనే సమాచారంతో కామయ్యపేట జంక్షన్ వద్ద తమ సిబ్బందితో కాపు కాసినట్టు చెప్పారు. ఆటోలో సారా తరలిస్తుండంతో ఆపేందుకు ప్రయత్నించామని, తమను చూసిన నిందితులు ఆటో నుంచి దూకి పారిపోయారన్నారు. ఆటోను పాడేరు తరలించి, 10 మూటల్లో ప్యాకెట్లలో ఉన్న 400 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. సారా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు పాడేరు మండలానికి చెందిన వారిగా గుర్తించామని, త్వరలోనే వారిని అరెస్టు చేస్తామని చెప్పారు.

నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో త్వరలో పది పడకల ఎస్‌ఎన్‌సీయూ



ఎన్‌ఆర్‌సీ సెంటర్‌లో అందిస్తున్న సేవలపై ఆరా తీస్తున్న జాయింట్ డైరెక్టర్ అర్జున్

నర్సీపట్నం: నవజాత శిశువులకు సత్వరమే వైద్య సేవలు అందించేందుకు ఏరియా ఆస్పత్రిలో త్వరలోనే పది పడకల ఎస్‌ఎన్‌సీయూను అందుబాటులోకి తీసుకువస్తున్నామని డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్ జాయింట్ డైరెక్టర్ అర్జున్ పేర్కొన్నారు. రూ.35 లక్షల వ్యయంతో సిద్ధం చేసిన ఎస్‌ఎన్‌సీయూ యూనిట్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. ప్రస్తుతం గిరిజన చిన్నారుల కోసం ఏర్పాటు ఐదు పడకల మినీ ఎస్‌ఎన్‌సీయూను పరిశీలించి ఓపీ వివరాలను, అక్కడ అందిస్తున్న సేవలపై యూనిట్ ఇన్‌చార్జి డాక్టర్ మల్లికార్జున్‌ను ఆరా తీశారు. ఎన్‌ఆర్‌సీ, ప్రసూతి విభాగాలను తనిఖీ చేశారు. పౌష్టికాహార లోపంతో బాధపడుతూ వైద్యం పొందుతున్న చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలోనే పది పడకల ఎస్‌ఎన్‌సీయూను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయా విభాగాలకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆయన వెంట ఆస్పత్రి ఆర్‌ఎంవో డాక్టర్ ప్రధాన్, వైద్యురాలు సువర్ణ ఉన్నారు.